క్లుప్తంగా

ప్రభుత్వ విప్ శ్రీనివాస్‌ను కలిసిన ఏఎస్పీ



గ్రంధి శ్రీనివాస్‌తో ఏఎస్పీ భీమారావు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాకు నూతనంగా నియమితులైన పోలీస్ శాఖ ఏఎస్పీ బి.భీమారావు శుక్రవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించిన శ్రీనివాస్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు.

మాదివాడలో పింఛన్ల పంపిణీ



మాదివాడలో పింఛన్ సొమ్ము అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆకివీడు: స్థానిక మాదివాడలో శుక్రవారం ఇంటింటా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మోటుపల్లి గంగాధరరావు పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచడం అభినందనీయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తోన్న జగన్‌కు మళ్లీ అవకాశం ఇచ్చి పథకాల్ని, అభివృద్ధిని ప్రజలు ఆకాంక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నిమ్మల నాగు, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రేపు చెకుముకి సంబరాలు

భీమవరం: జనవిజ్ఞాన వేదిక పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఈనెల ఏడో తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీ విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీలోని విష్ణు హైస్కూల్లో నిర్వహించనున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జామాను రామలక్ష్మణరావు తెలిపారు. ప్రతి మండలం, పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన గవర్నమెంట్ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు పాల్గొనాలని చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు పేర్కొన్నారు. సైన్స్ మ్యాజిక్ ప్రయోగాలు కార్యక్రమాలు నిర్వహిస్తామని మల్లుల శ్రీనివాస్ తెలిపారు. మూడు గంటలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, డాక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

జూదక్రీడలు నిర్వహిస్తే చర్యలు

పాలకోడేరు: సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు వేసినా, గుండాట, జూదం, కోతాటలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం మోగల్లు, కుముదవల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ హుస్సేన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం నాగ భూషణం నాయుడు, సర్పంచ్ భూపతి రాజు వంశీకృష్ణంరాజు, అంగరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పేదలకు సంక్షేమం



వృద్ధురాలిని పలుకరిస్తున్న పార్టీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి

పోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా అర్హులైన పేదలకు సంక్షేమం అందుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జి గుడాల గోపి అన్నారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికీ అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఆత్మీయ పలకరింపులతో వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సచివాలయం, వలంటీరు వ్యవస్థలతో ఎలాంటి అవినీతికి తావు ఇవ్వకుండా పాలన సాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు, అవ్వాతాతలు, రైతులు, యువత అన్ని వర్గాల వారు సీఎం జగన్‌కు అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరి చంటి రాజు, వీరవల్లి దుర్గారావు, యరక రాజు పెద్దిరాజు, దుర్గా ప్రసాద్ రాజు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టరు పెదపాటి పెద్దిరాజు, పారీట జిల్లా యూత్ అధ్యక్షుడు విన్‌స్టన్ బాబు పాల్గొన్నారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సీఎం జగన్ లక్ష్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాస్



వీరవాసరం : వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఆకివీడు : సీఎం జగన్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ కటౌట్‌లకు క్షీరాభిషేకం

వీరవాసరం: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం సచివాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష (2.0) వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. అయితే చంద్రబాబు హయాంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దూరం చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు హయాంలో ఉన్న ఆస్పత్రుల బకాయిలను చెల్లించి తిరిగి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారని వివరించారు. నేడు సుమారు 3,500 వ్యాధులకు పైగానే ఈ పథకంలో ఉచితంగా మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎంపిక చేసిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం వైద్యం అందే విధంగా సీఎం జగన్ చర్యలు తీసుకొన్నారని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో వైద్యాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రజలను కోరారు. ఆరోగ్యశ్రీలో వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంపు చేసి వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వం మనదేనని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచ్ చికిలే మంగతాయారు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, ఎంపీటీసీ బోను జోత్స్నాదేవి, నాయకులు గూడూరి ఓంకార్, గొలగాని సత్యనారాయణ, గెడ్డం భాస్కరరావు, నేతల జ్ఞాన సుందర్రాజు, మతల కాశి, మద్దాల సత్యనారాయణ, కందుల సురేష్, వీరవల్లి రాధ, బొంతు రమేష్, మద్దాల బాబి, గుబ్బల శ్రీను, కె.సత్యనారాయణరాజు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్, పీవీఎల్ కటౌట్‌లకు క్షీరాభిషేకం

ఆకివీడు: స్థానిక మాదివాడలోని ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులు పొందిన మహిళలు సీఎం జగన్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కటౌట్‌లకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. 2024, జగనన్న ఒన్స్‌మోర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలబడుతున్నాయని తెలిపారు. సంక్షేమంతోపాటు పేద, మధ్య తరగతికుటుంబాల ఆరోగ్యాన్ని జగనన్న దేవుడులా కాపాడుతున్నారని చెప్పారు. ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. ఇటువంటి ముఖ్యమంత్రి మళ్లీ, మళ్లీ కావాలని నినదించారు.

మహదేవపట్నంలో బాలిక అదృశ్యం

ఉండి: మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులో చదువుకుటున్న బాలిక క్రిస్మస్ సెలవులకు వచ్చిన ఈ నెల 3న ఉదయం 8.30 గంటల సమయంలో ఇంటి నుంచి ఏలూరు బయలు దేరింది. ఆమె ఏలూరు వెళ్లలేదని, ఆరోజు నుంచి కనిపించడం లేదని బాలిక నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు.

కోలమూరు జూనియర్ అసిస్టెంట్ మృతి

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ దామిశెట్టి వెంకటేశ్వరరావు (39) శుక్రవారం తెల్లవారు జామున ఆయన స్వగ్రామం ఉంగుటూరులో మృతి చెందాడు. కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడు నెలల క్రితం నిడమర్రు నుంచి కోలమూరు బదిలీపై అయ్యారు. గ్రామ సర్పంచ్ నడింపల్లి సత్యవతి, ఉపసర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ కొండలరావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎస్ శంకరం తదితర నాయకులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

క్రికెట్ విజేత పల్లెపాలెం జట్టు



ఆకివీడు : క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచి మండలానికి ఎంపికైన పల్లెపాలెం టీం



కాళ్ల : ఏలూరుపాడు హైస్కూల్లో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

ఆకివీడు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా గత వారం రోజుల నుంచి దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో పల్లెపాలెం జట్టు విజయం సాధించి మండలానికి ఎంపికైంది. గ్రామంలో మొత్తం నాలుగు టీములు పోటీ పడ్డాయి. దుంపగడప, టీఆర్ కాలనీ, పల్లెపాలెం, బోసు కాలనీల టీములు తలబడ్డాయి. ఫైనల్‌లో పల్లెపాలెం, తిమ్మరాజు కాలనీ పోటీ పడగా పల్లెపాలెం జట్టు విజయం సాధించింది. క్రికెట్ పోటీల్లో మత్స్యకారులు, దళిత యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు తమకు ఒక వేదికగా లభించిందని, క్రీడా ప్రతిభను కనబర్చేందుకు అవకాశం కలిగిందని పల్లెపాలెం (మత్స్యకారులు) టీము కెప్టెన్ తమ్ము వంశీ తెలిపారు. ఈ నెల 10న నిర్వహించే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటామని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలలో తలపడి విజయం సాధించాలనేది తమ ఆశయమన్నారు.

క్రికెట్ పోటీలు

కాళ్ల: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా గురువారం మండలంలోని ఏలూరుపాడు, కాళ్ల, కలవపూడి, సీసలి, కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆయా సచివాలయాల నుంచి 60 టీములు ఆటల్లో పాల్గొన్నాయి.

సీఎం జగన్ పాలన ఆదర్శం



37వ వార్డులో పార్టీ జెండా ఎగురువేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్ర రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన భారతదేశానికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక 37వ వార్డులో జగన్ రాష్ట్రానికి ఎందుకు కావాలి అనే కార్యక్రమం వార్డు ఇన్‌చార్జి చెన్ను చంటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఏఎస్ రాజు, గంటా సుందర్ కుమార్, మానేపల్లి నాగన్న బాబు, రేవూరి గోగురాజు, కోడె యుగంధర్, అల్లూరి శ్రీ నాగవల్లి, కందికట్ల ఎడ్వర్డ్, గుంటి ప్రభు, ఇంటి సత్యనారాయణ, పాలపర్తి జోనా, తుళ్లూరు చంటి, మెట్ట మురళి, ముత్యాల చంటి, మాదిరెడ్డి శ్రీనివాస్, నందమూరి ఆంజనేయులు, కరిముల్లా బాష, పెన్నాడ శ్రీను మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల్లో చర్మ వ్యాధి నివారణ టీకాలు



ముద్ద (లంప్) చర్మ వ్యాధి శోకిన ఆవు దూడ

ఆకివీడు: ముద్ద (లంప్) చర్మ వ్యాధిని మొదటిలోనే తుంచివేసే విధంగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు కె.జనార్ధనరావు అన్నారు. స్థానికంగా పలు ఆవు దూడలకు, ఆవులకు లంప్ వ్యాధి నివారణకు శుక్రవారం టీకాలు వేశారు. లంప్ వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలుగా గోట్ పాక్స్ వ్యాక్సిన్ వేయించుకోవాలని జనార్ధనరావు సూచించారు. ఇటీవల ఈ వ్యాధి ప్రబలి ఆవు దూడలు ఎక్కువగా చనిపోతున్నాయని హెచ్చరించారు. ఆవు జాతి పశువులకే ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుందన్నారు. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, బొడిపెలుగా రావడం, మోకాళ్ల వాపులు వంటి వాటిని గుర్తించి వైద్యం అందజేయాలని సూచించారు. అన్ని పశువైద్యశాలల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్టు ఏడీఏ చెప్పారు. అన్ని ఆవులకు వ్యాక్సిన్ వేస్తామన్నారు. వ్యాక్సిన వేసిన ఆవులు గతంలో ఏ విధమైన ఇబ్బంది లేకుండా జీవిస్తున్నాయని తెలిపారు. పలువురు పశు యజమానులు పాల్గొన్నారు.

పశువు వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: రైతులు వ్యవసాయంతో పాటు ఆర్థికతోడ్పాటు పొందేందుకు లక్షలాది విలువ చేసే పాడిని పెంచి పోషిస్తారని వాటికి సోకే వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు సూచించారు. భీమవరం మండలం కొమరాడ గ్రామంలో శుక్రవారం పశువులకు సోకే గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. 42 ఆవులకు, 215 గేదెలకు వ్యాక్సిన్‌లు వేసినట్లు పుండరీబాబు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి-2 మౌర్య సత్యేంద్ర, పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు. శనివారం దిరుసుమర్రులో గాలికుంటు నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డాక్టర్ పుండరీబాబు తెలిపారు.

శ్రీరాముని అక్షింతలతో గ్రామోత్సవం



దిరుసుమర్రులో అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

భీమవరం అర్బన్: భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో కోదండ రామాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అయోధ్య శ్రీరాముని స్పర్శించిన దివ్య అక్షింతలను మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. శ్రీ కోదండ రామ ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీరాముని అక్షితల పంపిణీ

ఉండి: అయోధ్య బలరాముని ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముని అక్షితలు ఉండి మండలం చిలుకూరులో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ నెల 22న ఆలయ ప్రారంభోత్సవ సమయంలో అక్షితలను తలపై వేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ధార్మిక ఉపన్యాసకుడు అల్లూరి వెంకట్రాజు, బీజేపీ నాయకుడు వేగేశ్న మూర్తిరాజు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరాజు, ముదునూరి సీతారామరాజు, వేగేశ్న కృష్ణంరాజు పాల్గొన్నారు.

కళాశాలలో సంక్రాంతి సంబరాలు





సీఎస్ఎన్ కళాశాలలో సంక్రాంతి సంబరాల దృశ్యాలు

భీమవరం: స్థానిక డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గంగిరెద్దులు, కోలాటం, హరిదాసు, బుడబుక్కలు, కొమ్ము దాసరి మొదలగు సంప్రదాయ కళలను ప్రదర్శించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి, చిన్న పిల్లలకు భోగి పండ్లు వేయించారు. సంప్రదాయ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. కళాశాల సెక్రటరీ – కరస్పాండెంట్ చిడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ నిర్మల, జీవీ రమణ, చీడే కృష్ణారావు, బొమ్మదేవర ప్రభాకర్ రావు, ఎ.సుధ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



అనాకోడేరులో హైస్కూల్లో మాట్లాడుతున్న పావని

భీమవరం అర్బన్: విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆంధ్రా యూనివర్సిటీ ఉన్నత్ భారత్ అభియాన్ సమన్వయకర్త డాక్టర్ భీశెట్టి పావని అన్నారు. భీమవరం మండలం అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డీఎన్నార్ కళాశాల ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పావనని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ జుత్తిగ కనకదుర్గ ప్రసాద్, ఎంపీటీసీ మైనపు వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడపాటి మిల్టన్, పెచ్చెట్టి సత్యనారాయణ, ఎస్ అనిల్ దీప్, ఇ.భరత్ రాజ్, రేపాక వెంకన్నబాబు, వి.మేర్సీ నిర్మల కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం



తూర్పుపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం తూర్పుపాలెంలో మహిళలతో మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పన ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కొన్ని సచివాలయాల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయన్నారు. కొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. వీటితో పాటు కోట్లాది రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతోనూ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే వీటిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. కమ్యూనిటీ భవన నిర్మాణాలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. జగనన్న కాలనీల్లోనూ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, విద్యా మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్‌కు పరామర్శ

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెనుగొండకు చెందిన వలంటీరు పడాల సుదర్శన్ రెడ్డిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. శుక్రవారం తణుకులోని సుధా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

యలమంచిలి: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తుందని వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కనకాయలంక తుఫాన్‌షెల్టర్ వద్ద గడప గడపకు మన ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వలవల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పులి సుబ్రహ్మణ్యం, వలవల నరసింహమూర్తి, యన్నాబత్తుల సుదీర్, చింద్రిపు గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

పాలకొల్లు అర్బన్: గత ఏడాది కొత్తపేట గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహించే సోషల్ ఆడిట్ పారదర్శకంగా ఉండాలని గ్రామ సర్పంచ్ కవురు భారతి సూచించారు. మండలంలోని కొత్తపేట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సోషల్ ఆడిట్‌లో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. ఎంఈఓ ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), సచివాలయ కార్యదర్శి జానకిరామచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కవురు భాస్కరబాబు, కవురు గాంధీ పాల్గొన్నారు.

రేపు చాంబర్స్ కళాశాలలో స్కాలర్‌షిప్ టెస్ట్

పాలకొల్లు సెంట్రల్: మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టులు నిర్వహిస్తున్నామని చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తోట ఓల్గా శుక్రవారం తెలిపారు. ఈ టెస్టులు పదో తరగతి చదువుకునే విద్యార్థులకు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. చాంబర్స్ జూనియర్ కళాశాలలో ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు టెస్ట్ నిర్వహిస్తామన్నారు. టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 11 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులుగా రూ. 5 వేలు చొప్పున ఫీజులో రాయితీ రూపంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

భీమవరం: స్థానిక గునుపూడికి చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై ఎస్.హనుమంతరావు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఈనెల 4 నుంచి కనిపించడం లేదని పేర్కొన్నారని చెప్పారు.

డాక్యుమెంట్స్ పోయినవి

డోర్ నెం.14-54/1/1 ... ఆకివీడు మండలం ...
ది.06.01.2024

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

భీమవరం డివిజన్
90102 23729
Office mail : tpgadvt@gmail.com